క్లుప్తంగా

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ లావణ్య

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాల నుంచి సుందిళ్ల మీదుగా గోదావరిఖని వైపు వెళ్లే ప్రధాన రోడ్డునిర్మాణం పనులను సర్పంచ్ లావణ్య గురువారం పరిశీలించి మాట్లాడారు. గతంలో రోడ్డు పూర్తిగా గుంతలు పడి ఉండడంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. రోడ్డు పనులు ప్రారంభించడంతో గ్రామస్తులతో పాటు వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాక్టర్ డ్రైవర్ల వేతనాలు పెంచాలి



ధర్నా నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు

గోదావరిఖని: ట్రాక్టర్‌డ్రైవర్ల వేతనాలు పెంచాలని కోరుతూ గురువారం రామగుండం ఏరియా మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడంతో డ్రైవర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి పరిష్కార మార్గం చూపాలన్నారు. ఐఎఫ్‌టీయూ నాయకులు ఎ.వెంకన్న, చిలుక శంకర్, కృష్ణ, నరేశ్, బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న సర్పంచ్ శంకర్

కమాన్‌పూర్: మండలంలోని సిద్దిపల్లెకు చెందిన మాడిశెట్టి సిద్ధార్థ, మచ్చ కావేరి, తాటికొండ అక్షయ, మాటేటి మారుతి, సామాల మహేశ్ వివిధ పాఠశాలలో చదివి పది పరీక్షల్లో ఉత్తమ జీపీఏలు సాధించిన విద్యార్థులను గురువారం జీపీ కార్యాలయంలో సర్పంచ్ శంకర్ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బోనాల వెంకటస్వామి, ఉపసర్పంచ్ జాబు సతీశ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలి



డబుల్‌బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో పూర్తైన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని సీపీఎం నాయకులు కల్లెపల్లి అశోక్, సీపెల్లి రవీందర్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి శివారులో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను గురువారం పరిశీలించి మాట్లాడారు. లాటరీ పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేసిన అధికారులు పనులు పూర్తయిన ఇళ్లను కేటాయించాలన్నారు. అసంపూర్తి పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. నాయకులు దిలీప్, నవీన్, సదయ్య ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న వ్యాపారి



బంగారం అప్పగిస్తున్న వ్యాపారి మస్రత్

పెద్దపల్లిరూరల్: మండలంలోని పాలితం గ్రామానికి చెందిన కొప్పుల పద్మ పట్టణంలోని మేన్‌రోడ్‌లోని జనరల్ స్టోర్‌లో వస్తువులను కొనుగోలు చేసి తన బంగారు చెవి కమ్మలను అక్కడే మర్చిపోయి వెళ్లింది. దీంతో వాటిని గమనించిన వ్యాపారి సయ్యద్ మస్రత్ తనవద్దే భద్రపర్చుకున్నాడు. కొంతసేపటి తర్వాత ఆందోళన చెందుతూ వచ్చిన పద్మకు తిరిగి బంగారు కమ్మలు అందించి నిజాయితీ చాటుకున్నాడు. తన వస్తువు భద్రంగా అప్పగించిన మస్రత్‌కు పద్మ కృతజ్ఞతలు తెలిపింది.

అడ్మిషన్లు ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం పాలకుర్తిలో ఆరో తరగతిలో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వరూప తెలిపారు. ఆరో తరగతిలో మిగిలిఉన్న 10 సీట్లకు విద్యార్థులు నేరుగా కేజీబీవీకి వచ్చి అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 95159 53589 నంబరులో సంప్రదించాలని సూచించారు.

అన్నదాతకు అద్దెభారం

- అద్దెకు తెస్తున్న టార్పాలిన్లు
- రోజుకు రూ.15 నుంచి 20 వసూలు
- ధాన్యం ఆరబోతకు వినియోగిస్తున్న వైనం
- ఉపాధి పొందుతున్న ఆంధ్రప్రదేశ్ వాసులు
- సబ్సిడీపై అందించాలంటున్న రైతులు



ధూళికట్టలో టార్పాలిన్లను అద్దెకు ఇస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా వాసులు

ఎలిగేడు: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొంతమంది జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో టార్పాలిన్లు అద్దెకు ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. రైతులు ఒక్కో టార్పాలిన్‌కు రోజుకు రూ.15 నుంచి రూ.20 చెల్లించి అద్దె ప్రాతిపదికన తీసుకెళ్తున్నారు. ధాన్యం అమ్మకాలు పూర్తవగానే వీటిని తిరిగి నిర్వాహకులకు అందిస్తున్నారు. ఈక్రమంలో రైతులకు ప్రభుత్వమే టార్పాలిన్ కవర్లు సబ్సిడీపై అందించాలని కేంద్రాల్లో ధాన్యం తూకం వేయడం ఆలస్యమైతే రోజులవారీగా టార్పాలిన్ కవర్లకు అద్దె చెల్లిస్తున్నామని అద్దెభారంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అవసరం మేరకు ఆంధ్రప్రదేశ్ నుంచి పరదాల సరఫరా

జిల్లా వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో సుమారు 2.5 లక్షల ఎకరాల్లో వరిసాగైంది. అన్ని మండలాలు, గ్రామాల్లో సింగిల్‌విండోల, టీసేర్ప్, మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా ఆంధ్రప్రదేశ్ నుంచి పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాలతో పాటు తదితర జిల్లాలకు చెందిన పలువురు తెలంగాణలోని పలు జిల్లాల్లో యాసంగి, వానకాలంలో టార్పాలిన్లు అద్దెకు ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. మండలాల వారీగా డిమాండ్‌ను బట్టి రోజుకు 300 నుంచి 650 వరకు టార్పాలిన్లను అద్దెకు ఇస్తూ రోజుకు రూ.1,000 నుంచి రూ.1500వరకు సంపాదిస్తున్నట్లు చెబుతున్నారు. టార్పాలిన్ చిరిగిపోతే తామే బాగు చేసుకుంటామనీ, రైతుల నుంచి ఖాళీ సంచులను తీసుకుని వాటితో చిరిగిన చోట కుట్టించి మళ్లీ అద్దెకు ఇస్తామని నిర్వాకులు పేర్కొంటున్నారు. సీజన్ పూర్తవగానే కర్ణాటక, ఆంధ్రాకు వెళ్లి అక్కడ టార్పాలిన్లు అద్దెకిస్తూ వ్యాపారం చేసుకుంటామని చెబుతున్నారు.

అందని సబ్సిడీ టార్పాలిన్లు...

కేంద్రాల్లో రైతులు ధాన్యం ఆరబోసేందుకు వర్షం వస్తే ధాన్యంపై కప్పేందుకు టార్పాలిన్లు ఉపయోగిస్తుంటారు. నాలుగేళ్లుగా సబ్సిడీ టార్పాలిన్లు పంపిణీ చేయకపోవడంతో ప్రైవేట్‌గా అద్దెకు తెచ్చుకుంటున్నారు. కేంద్రాల వద్ద కొనుగోళ్లు ఆలస్యమైతే టార్పాలిన్ల అద్దెభారం పెరిగిపోతుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లను పంపిణీ చేసి కేంద్రాల్లో కూడా రైతులకు సరిపడా అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

భారం అవుతోంది



అద్దె పరదాలు తెచ్చుకుంటున్న రైతులకు అద్దె భారం తడిసి మోపెడవుతోంది. ఒక్కో రైతుకు సుమారు. రూ.1000వరకు ఖర్చు అవుతోంది. గతంలో రోజుకు ఒక్కో టార్పాలిన్‌కు రూ.10 ఉండేది ధరలు పెంచడంతో రూ.15 చెల్లించాల్సి వస్తోంది.

– బొంతు సారయ్య రైతు, నేతకానిపల్లి

సమన్వయంతో గ్రామాల అభివృద్ధి

- గ్రామంలో కలియదిరిగిన జేడీ
- అభివృద్ధిలో ముందున్నారని సర్పంచ్ సంతోష్ రావుకు ప్రశంస



నర్సరీని పరిశీలించి సూచనలిస్తున్న జేడీ శ్రీనివాస్

జూలపల్లి: గ్రామాల అభివృద్ధిలో పాలక వర్గాలు, అధికారులు, సమన్వయంతో పనిచేస్తే పల్లెల రూపురేఖలు మారుతాయని, అన్ని రంగాల్లో సత్వర అభివృద్ధి సాధ్యమవుతుందని పంచాయతీ రాజ్‌శాఖ గ్రామీణాభివృద్ధి కమిటీ జాయింట్ డైరెక్టర్ అరెపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని కుమ్మరికుంటలో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్యం కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీచేశారు. గ్రామంలో కలియతిరిగి పనులను ప్రత్యక్షంగా చూసి వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా గ్రామంలోని నర్సరీ, రోడ్లు, శ్మశానవాటిక, డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్ షెడ్, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, ఎస్సీ కాలనీని పరిశీలించారు. అనంతరం గ్రామం అభివృద్ధిలో ముందుంచిన పాలక వర్గాన్ని అభినందించారు. పంచాయతీ సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లు అందించి ఎండల పనిచేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆయనవెంట సర్పంచ్ సంతోష్ రావు, ఎంపీవో కిరణ్, ఏపీవో సదానందం, పంచాయతీ కార్యదర్శి అంజలీధర్, కారోబార్ మధు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్స్, సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

గ్రామదేవత ఆశీస్సులు అందరిపై ఉండాలి

మంథని: గ్రామ దేవతల అనుగ్రహంతో ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని బీజేపీ నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆకాంక్షించారు. గురువారం మంథని మండలం పుట్టపాక జీపీ పరిధిలోని చల్లపల్లి గ్రామంలో పోచమ్మ కొలువు సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అసెంబ్లీ కో– కన్వీనర్ నాంపల్లి రమేశ్, నాయకులు మల్లికార్జున్, బూడిద తిరుపతి, చల్ల శ్రీనివాస్, ఎర్ర శ్రీనివాస్ ఉన్నారు.

ధూళికట్టలో 168 మందికి కంటి పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో నిర్వహిస్తున్న 'కంటివెలుగు' వైద్యశిబిరంలో గురువారం168 మందికి కంటి పరీక్షలు చేసి 12 మందికి కంటి అద్దాలు అందించారు. కార్యక్రమలో సర్పంచ్ గొల్లె కావేరి, ఎంపీటీసీ ఇరుగురాల సావిత్రమ్మ, వైద్యాధికారి నిస్సీక్రిస్టీనా, మెడికల్ క్యాంపు ఆఫీసర్ స్వప్న, కార్యదర్శి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఈనెల 28న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ప్రగతినగర్ కూడలి వద్ద స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఈనెల 28న ఏర్పాటు చేయనున్నట్లు బీఆర్‌ఎస్ నాయకుడు, ఎన్టీఆర్ అభిమానసంఘ జిల్లా అధ్యక్షుడు ఉప్పు రాజు తెలిపారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు. ఇందుకు ఎన్టీఆర్ అభిమానులు మస్రత్, సారయ్యగౌడ్, తిరుపతి, శ్రీనివాస్, సంపత్ కమిటీని ఖరారు చేసినట్లు తెలిపారు.

20న ఎన్టీపీసీ ఆర్‌జేపీసీ సమావేశం

జ్యోతినగర్: ఈనెల 20, 21 తేదీల్లో ఎన్టీపీసీ సదరన్ రీజియన్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ (ఆర్‌జేపీసీ)సమావేశం కేరళ రాష్ట్రంలోని టెక్కడిలో నిర్వహించనున్నారు ఈ సమావేశానికి ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఉద్యోగ గుర్తింపు సంఘం ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ ప్రధానకార్యదర్శి కొలిపాక మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కాసర్ల వెంకటస్వామి, బీఎంఎస్ నాయకుడు సాగర్‌రాజు, అధికారుల సంఘం నుంచి సోమ్లా భూక్యా, వంశీ, రాజేశ్ సమావేశంలో పాల్గొనేందుకు టెక్కడి బయలుదేరి వెళ్లారు.

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట, ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సబ్సిడీపై జీలుగ విత్తనాలు 833 బస్తాలు అందుబాటులో ఉన్నాయని ఏవో ఎం.ఉమాపతి తెలిపారు. ఒక్కో బస్తా 30కిలోలు ఉంటుందని బస్తా ధర రూ.843 అన్నారు. జీలుగా బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందని, కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్ నంబర్‌తో పీఏసీఎస్‌లో తీసుకోవాలని ఏవో తెలిపారు.

ఎంఎల్‌హెచ్‌పీగా నవ్యశ్రీ

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని రత్నాపూర్ పల్లె దవాఖానకు ఎంఎల్‌హెచ్‌పీగా నవ్యశ్రీని నియమించగా గురువారం విధుల్లో చేరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ప్రతిమ, కార్యదర్శి పెండ్లి రమ్య, నాయకులు పీ.వీ.రావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సహజ సంపదను దోచుకుంటున్నారు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో సహజవనరులను అధికార పార్టీ నాయకులు యథేచ్ఛగా దోచుకుంటున్నారని బీజేపీ దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. ఈ ప్రాంతంలోని ఇటుకబట్టీలకు అక్రమంగా మట్టి తరలుతోందంటూ ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు సమ్మయ్య, కుమార్, వెంకటేశ్వర్ రావు, ఆనంద్, కరుణాకర్ తదితరులున్నారు.

బీమా చెక్కు పంపిణీ

పెద్దపల్లిరూరల్: మండలంలోని నిట్టూరు గ్రామానికి చెందిన తూముల నంబయ్య బీఆర్‌ఎస్ కార్యకర్త ఇటీవల ప్రమాదవశాత్తు మరణించాడు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ సభ్యత్వం నమోదు చేసుకోవడంతో ప్రమాదబీమాలో మంజూరైన రూ.2లక్షల చెక్కును గురువారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మృతుడి భార్య శారదకు అందించారు. జెడ్పీటీసీ రామ్మూర్తి, నాయకులు మార్కు లక్ష్మణ్, శ్రీనివాస్, వెంకట్రాజం,వేణుగోపాల్‌రావు, కుమార్ తదితరులున్నారు.

మండలస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

పాలకుర్తి: మండలంలోని రాణాపూర్ గ్రామంలో గురువారం మండల స్థాయి క్రికెట్‌టోర్నీ ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి మొత్తం 16 టీంలు ఈ టోర్నీ పాల్గొంటున్నట్లు టోర్నీ నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మునిగాల సదానందం, కాదాసి తిరుపతి, ఉదయ్, వంశీ, శ్రావణ్, కుమార్, సతీశ్, ఆదిమూలం సాయి, వివిధ గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక పనులు పూర్తిచేయండి

సుల్తానాబాద్: పట్టణంలోని పుసాలలో శ్మశానవాటికలు పూర్తికాకుండానే కాంట్రాక్టర్ వదిలివెళ్లాడని బీఆర్‌ఎస్ నాయకులు పురం రమణ ఆరోపించారు. దహన సంస్కారాలు చేసే క్రమంలో మహిళలు స్నానాలు చేసిన తర్వాత బట్టలు మార్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. శ్మశానవాటిక పనులను అధికారులు చొరవ తీసుకొని వెంటనే పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

నేడు సీపీఆర్‌పై అవగాహన సదస్సు

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని రత్నాపూర్ రైతువేదికలో సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేశ్ తెలిపారు. సదస్సుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,కార్యదర్శులు, ఐకేపీ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొనాలని తెలిపారు.

ఈజీఎస్ పనుల పరిశీలన



ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను గురువారం ఈజీఎస్ టీఏ రంజిత్ సందర్శించి, పరిశీలించారు. కాలువ పూడికతీత పనులతీరు, కూలీల వసతుల కల్పన తదితర విషయాలపై అడిగి తెలుసుకున్నారు.

స్వచ్ఛ పెద్దపల్లిగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మున్సిపల్‌చైర్మన్

పెద్దపల్లిరూరల్: పట్టణాన్ని స్వచ్ఛపెద్దపల్లి గా తీర్చిదిద్దేందుకు మహిళలందరిలో చైతన్యం పెంచాల్సిన అవసరముందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలో గురువారం మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి, కమిషనర్ శ్రీనివాసరెడ్డితో కలిసి మెప్మా ఆర్‌పీ, ఓబీలతో సమావేశమై పలు సూచనలుచేశారు. ఇంటినుంచి తడి, పొడిచెత్తను వేరుచేసి ఇచ్చేలా మెప్మా సిబ్బంది ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. చెత్తను వర్మీకంపోస్టుగా మార్చే విధానంపై గ్రూపు సభ్యులందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని, ఖాళీస్థలంలో పండ్లు, కూరగాయలు, పూల మొక్కలు పెంచాలన్నారు. మున్సిపల్‌సిబ్బంది రమాకాంత్, రామ్మోహన్‌రెడ్డి, రాజు ఉన్నారు.

ప్రజలు రాక కార్యాలయాలు వెలవెల




ఖాళీగా దర్శనమిస్తున్న కార్యాలయం

జూలపల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు నిత్యం ప్రజలతో సందడిగా ఉండేవి. 10రోజులుగా ఎండలు దంచి కొడుతుండడంతో సందర్శకుల తాకిడి తగ్గింది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు ఉద్యోగులు తప్పా ప్రజలు రావడం లేదు. రోజు 44 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో కార్యాలయాలకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఉదయం 10 గంటలు దాటిన తర్వాత జన సంచారం లేకపోవడంతో మండలకేంద్రంతో పాటు గ్రామాల్లో బంద్ వాతావరణం నెలకొంటోంది.

మహా సంపర్క్ అభియాన్ ఇన్‌చార్జీగా ప్రదీప్

జూలపల్లి: మండలకేంద్రానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు,అమరగాని ప్రదీప్‌కుమార్ గౌడ్‌ను మహా సంపర్క్ అభియాన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ ఉత్తర్వులు అందించారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను మే 30 నుంచి జూన్ 30 వరకు బూత్‌స్థాయిలో ప్రజలకు వివరించేందుకు నియమించిన ఆరుగురు సభ్యుల్లో జూలపల్లి నుంచి ప్రదీప్ కుమార్ గౌడ్‌కు ధర్మారం మండల ఇన్‌చార్జీగా అవకాశం దక్కింది. ప్రదీప్ మాట్లాడుతూ అన్ని రంగాల్లోని అట్టడుగు వర్గాల అభివృద్ధికి బీజేపీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని అన్నారు. జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

జ్యోతిక రిక్రియేషన్ క్లబ్ ఎన్నికలు ఎప్పుడో ?



జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు పీటీఎస్‌లోని జ్యోతిక రిక్రియేషన్ క్లబ్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారోనని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల గడువు ఫిబ్రవరి నెలతో ముగియడంతో తిరిగి మళ్లీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో అని చర్చించుకుంటున్నారు. ఉద్యోగులు, అధికారులు క్లబ్‌లో సభ్యులుగా ఉంటారు. ఉద్యోగుల ఆహ్లాదం కోసం క్లబ్‌లో పలు సౌకర్యాలు, ఆహ్లాదం కోసం పలు పండుగల సమయాల్లో నిర్వహించే కార్యక్రమాలు, క్రీడా పోటీలు క్లబ్ పాలక వర్గంతో నిర్వహిస్తుంటారు. మూడు నెలలు గడుస్తున్నా ఎన్నికల ప్రక్రియ చేపట్టకపోవడంతో క్లబ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కుతూహలంగా ఉన్న పలువురు నిరాశతో ఉన్నారు. యాజమాన్యం క్లబ్ ఎన్నికలు నిర్వహించాలని పలువురు చర్చించుకుంటున్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు



పరిశీలిస్తున్న ఎంపీడీవో శశికళ



పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రాంబాబు

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఎంపీడీవో శశికళ అన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో గురువారం ఎంపీడీవో పారిశుధ్యం పనులను పరిశీలించి మాట్లాడారు. ప్రతీకాలనీలోఎప్పటికప్పుడు డ్రెయినేజీలను శుభ్రంచేయాలని, రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించాలని సూచించారు. సర్పంచ్ వీరగోని సుజాత, రమేశ్, ఎంపీఓ ఫయాజ్‌అలీ, కార్యదర్శి ప్రశాంత్, కారోబార్ వెంకన్న వెంట ఉన్నారు.

కమాన్‌పూర్: మండలంలోని పేరపల్లి, రొంపికుంట జూలపల్లి గ్రామాలను డీఎల్‌పీవో రాంబాబు గురువారం సందర్శించి గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్యం పనులను పర్యవేక్షించారు. డీఎల్‌పీవో వెంట ఎంపీడీవో విజయ్‌కుమార్, సర్పంచ్‌లు తొగరి అన్నపూర్ణ, కట్కం రవీందర్, బొల్లపెల్లి శంకర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులున్నారు.

మోదీ పాలనను ప్రజలకు వివరిద్దాం

- ప్రజాసంక్షేమ పథకాలపై అవగాహన కల్పిద్దాం
- బూత్ స్థాయి వారీగా సమావేశాలు
- మహాజన సంపర్క్ అభియాన్ రాష్ట్ర కన్వీనర్ ప్రదీప్‌కుమార్



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

పెద్దపల్లిరూరల్: ప్రధానిమోదీ పాలనాతీరుతో నవ భారత నిర్మాణానికి పాటుపడుతూనే ప్రపంచ వేదికపై తనదైన ముద్రవేశాడని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, మహాజన సంపర్క్ అభియాన్ రాష్ట్ర కన్వీనర్ దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. పెద్దపల్లిలో గురువారం కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 26 నాటికి ప్రధానిగా తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకుంటున్న మోదీ అన్నివర్గాల ప్రజల సంక్షేమం, పల్లెల అభివృద్ధికి నేరుగా అందిస్తున్న నిధులు, గ్రామంలో నిరుపేద కూలీలకు అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకం వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రతీబూత్ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం, లబ్ధిదారులతో ముఖాముఖి వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నాయకులు చందుపట్ల సునీల్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, ప్రదీప్‌కుమార్‌గౌడ్, భీమారపు సంపత్, తంగెడ రాజేశ్వర్‌రావు, ముంజ రాజేంద్రప్రసాద్, దాడి సంతోష్, సురేశ్, పిడుగు కృష్ణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి పీహెచ్‌సీగా మార్చాలి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న మహేందర్

ఎలిగేడు: మండలకేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని పూర్తిస్థాయి పీహెచ్‌సీగా మార్చి వసతులు కల్పించాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్‌కు ఎలిగేడు మాజీ ఉపసర్పంచ్ మహేందర్ వినతిపత్రం అందించారు. మండలంలోని 12 గ్రామాల ప్రజలకు ఏదైనా అత్యవసరంగా ఆరోగ్యసమస్య తలెత్తితే పెద్దపల్లి, కరీంనగర్ పట్టణాల్లోని ప్రభుత్వాసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సివస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎలిగేడు ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్, జనరేటర్ సదుపాయాలు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎలిగేడు ప్రభుత్వాస్పత్రిలో 24 గంటల వైద్యసేవలు అందుబాటులోకి తేవాలని, ఉదయం, రాత్రివేళల్లో సిబ్బంది సేవలు మండలప్రజలకు అందించేలా చూడాలని డీఎంఅండ్ హెచ్‌వో ప్రమోద్‌కుమార్‌కు అందించిన వినతి పత్రంలో మహేందర్ పేర్కొన్నారు.

'బహుజనులు ఏకమవుతుంటే ఓర్వలేకపోతున్నారు'



మాట్లాడుతున్న యాకూబ్

మంథని: బహుజనులంతా ఏకమవుతుంటే ఓర్వలేని కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు ఎస్.కే.యాకూబ్ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మంథనిలో రెండు రోజుల క్రితం ఏర్పాటుచేసిన బీపీ మండల్ విగ్రహావిష్కరణ బహిరంగ సభకు పెద్దఎత్తున బహుజనులు హాజరుకావడంతో కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో 10వేల ఇళ్లు కట్టిస్తే ఏమైనట్లు ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, టీఆర్‌ఎస్, పుట్ట మధుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బత్తుల సత్యనారాయణ, నాయకులు బాబా, సుల్తాన్ ఆసీఫ్, ఇర్ఫాన్, ఫయాజ్. షేక్ సల్మాన్ ఉన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్ట్ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: మహిళా రెజ్లర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌ను అరెస్టుచేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ వద్ద గురువారం ఎస్‌ఎఫ్‌ఐ, కేవీపీఎస్, డీవైఎఫ్‌ఐ నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఎంపీ బ్రిజ్ భూషణ్‌చరణ్‌సింగ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ మహిళా రెజ్లర్ ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఢిల్లీలో వారుచేస్తున్న పోరాటానికి మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజాసంఘాలు మద్దతు తెలిపి నిరసన వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఎంపీని అధ్యక్ష పదవి నుంచి తొలగించి అరెస్ట్‌చేయాలని డిమాండ్‌చేశారు. నాయకులు జ్యోతి, ప్రశాంత్, రవీందర్, శ్రావణ్, అశోక్, దిలీప్, సురేశ్, శంకర్, నవీన్, వినయ్, ప్రదీప్, పృథ్వీరాజ్ ఉన్నారు

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న దుద్దిళ్ల శ్రీనుబాబు

కమాన్‌పూర్: మండలంలోని పెంచికల్‌పేట, రొంపికుంట గ్రామాలకు చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతున్నవారిని కాంగ్రెస్ నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు పరామర్శించారు. అనంతరం పది పరీక్షల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు, సర్పంచ్‌లు అన్నపూర్ణ, కట్కం రవీందర్, ఉపసర్పంచ్ గుమ్మడి సతీశ్ నాయకులు కుందారపు బాపు, చొప్పరి శేఖర్, గుమ్మడి శ్రీనివాస్, కట్కం నారాయణ, పెంద్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.